





చిత్తూరు నగరం గిరింపేటలో చాముండేశ్వరీ దేవి అలంకారంలో దుర్గాంబ - వజ్రకవచ అలంకరణలో పుంగనూరు బజారువీధిలోని వాసవీకన్యకాపరమేశ్వరీదేవి

బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో మొదటి రోజైన మంగళవారం బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు గంగమ్మ దర్శనమిచ్చారు. ఆలయాన్ని శుద్ధి చేసిన అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. డార్మిటరి హాల్లో ప్రత్యేకంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి, కళశ స్థాపన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉభయదారులచే వేదపండితులు అమ్మవారి మూల మంత్రాన్ని పఠింపజేస్తూ బాలాత్రిపుర సుందరీదేవి విశిష్టతను వివరించారు.గంగమ్మకు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాలేజీ మెట్లు దిగుతుండగా ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ చివరకు రెండు గ్రామాల సమస్యగా మారింది. పరిస్థితి చెయ్యి దాటుతోందని గ్రహించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విద్యార్థుల కథనం మేరకు.. గుడిపాల మండలం నారగల్లుకు చెందిన ఫ్రాంక్లిన్(19) చిత్తూరు సీతమ్స్ కాలేజీలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. బంగారుపాళ్యం మండలం తంబుగానిపల్లెకు చెందిన జగదీశ్(21) అదే కళాశాలలో డేటా సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. వారం రోజుల కిందట కాలేజీ మెట్లు దిగుతుండగా ఒకర్నొకరు తోసుకుంటూ వెళ్లడంతో ఘర్షణ మొదలైంది. ఫ్రాంక్లిన్ కోపంతో జగదీశ్‌పై దాడి చేసి గాయపరిచాడు. అప్పటి నుంచి కాలేజీకి వెళ్లకుండా జగదీశ్ ఇంటి వద్దనే ఉండిపోయాడు. మంగళవారం జగదీశ్ కొంతమంది స్నేహితులతో కలిసి కాలేజీ వద్దకు వచ్చి ఫ్రాంక్లిన్‌పై దాడికి పాల్పడ్డాడు. గాయాలపాలైన ఫ్రాంక్లిన్‌ను సమీపంలో ఉన్న ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న అతడి బంధువులు కాలేజీ వద్దకు చేరుకున్నారు. గొడవ పెద్దదవుతోందని తెలుసుకున్న తాలూకా స్టేషన్ పోలీసులు కాలేజీ వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఇరువర్గాలకు చెందిన వారిని పిలిపించి రాజీ చేసే ప్రయత్నం చేస్తున్నారు.

గ్రామ సచివాలయాలకు ఫైబర్‌నెట్ బంద్

పౌరసేవలకు అంతరాయం - నెట్ ఖర్చు భారమవుతోందంటున్న సిబ్బంది



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో ఫైబర్‌నెట్ సేవలు బంద్ అయ్యాయి. ఫలితంగా పౌరసేవలకు అంతరాయం కలిగింది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామ సచివాలయాలకు అంతరాయం లేని ఫైబర్ నెట్ సేవలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. గత ఏడాది కార్యాలయాలను సర్వేచేసి, వాటికి కనెక్షన్లు ఇచ్చారు. కానీ మెజార్టీ సచివాలయాల్లో సేవలు అందడం లేదు. ఫైబర్‌నెట్ ప్రతినిధులు వాటి నిర్వహణను పూర్తిగా వదిలేశారు. దీంతో కార్యాలయాల్లో నెట్‌బాక్సులు మూలకు చేరాయి. జిల్లాలో 220 గ్రామాల్లో నెట్ కనెక్షన్లు లేకపోవడంతో కొండల్లోకి, గుట్టల్లోకి వెళ్ళి ప్రజలకు అవసరమైన పత్రాలను సిబ్బంది అందజేస్తున్నారు. ఈ కారణంగా విధులకు అలస్యమౌతుందని, ప్రభుత్వ యాప్‌లను వందశాతం సక్రమంగా నిర్వహించలేక ఉన్నతాధికారుల నుంచి అనవసరంగా తాఖీదులు అందుకుంటున్నామని సిబ్బంది వాపోతున్నారు. గ్రామ సచివాలయాల్లో కుల, ఆదాయ, రేషన్ కార్డు, పింఛన్ దరఖాస్తులు, భూరీసర్వే వంటి 500కు పైగా సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఫైబర్‌నెట్ అంతరాయంతో ప్రజలకు ఆ సేవల పత్రాలు అందించేందుకు వీలు కావడంలేదు. రోజుకు ఒక సచివాలయానికి అన్ని రకాల సేవల వినియోగానికి 4జీబీనుంచి 6జీబీ ఇంటర్నెట్ అవసరమవుతోంది. ఫైబర్ నెట్ రాకపోవడంతో సిబ్బంది తమ సెల్ ఫోన్ల నుంచి నెట్ కనెక్షన్ తీసుకుని పత్రాలను అందజేస్తున్నారు. దీంతో తమకు రూ.150 నుంచి రూ.200 దాకా ఖర్చవుతుందని సిబ్బంది వాపోతున్నారు. గత ఏడాది నుంచి స్టేషనరీ నగదు జమకావడంలేదంటున్నారు. ఫైబర్ నెట్ సమస్యను జిల్లా సచివాలయాల సమన్వయకర్త రవికుమార్ దృష్టికి తీసుకెళ్ళగా... ఉన్నతాధికారులకు తెలియజేశామని, త్వరలోనే సమస్య పరిష్కారమౌతుందని తెలిపారు.

గ్రామ సచివాలయాల సంఖ్య	-----	612
ఫైబర్‌నెట్ కనెక్షన్లు ఇచ్చినవి	------	575
సేవలు అందుతున్నవి	--------	220

పోక్సో కేసులో 20ఏళ్ల జైలు, జరిమానా



యుగంధర్

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం తీర్పు చెప్పింది.తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట మండలం పత్రపాళ్యం గ్రామానికి చెందిన యుగంధర్ 2021 నవంబరు 19వ తేది రాత్రి 13 ఏళ్ళ వయసున్న ఓ బాలిక తన తండ్రికోసం ఇంటివద్ద ఎదురుచూస్తుండగా గమనించాడు.దూరపు బంధువైన ఆ బాలికతో తన తల్లికి ఆరోగ్యం బాగాలేక శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో ఉందని, నిన్ను చూడాలంటోందని చెప్పాడు. ఆ మాటలు నిజమని నమ్మిన బాలిక యుగంధర్‌తో పాటు ద్విచక్రవాహనంలో బయల్దేరింది.శ్రీకాళహస్తి గుడి వద్దకు తీసుకువెళ్ళిన యుగంధర్ ఆ బాలికతో తనను పెళ్లి చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి వివాహం చేసుకున్నాడు.23వ తేది మధ్యాహ్నం 2 గంటలకు కల్వెట్టు గ్రామం బయట ఆమెను వదిలి వెళ్ళిపోయాడు. జరిగిన విషయాన్ని ఆ బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదుచేసి యుగంధర్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం చిత్తూరు పోక్సో కోర్టులో విచారణకు రాగా పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శంకర్‌రావు నిందితుడు యుగంధర్‌కు 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.6500 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం ప్రభుత్వం తరపున చెల్లించాలని తీర్పుచెప్పారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి వాదించారు.

ఓపెన్ స్కూల్లో 31వరకూ అడ్మిషన్లు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్లో టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందేందుకు రూ.200 అపరాధ రుసుముతో అక్టోబరు 31 వరకు గడువు పొడిగించినట్లు డీఈవో వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీసేవ, ఏపీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రవేశాలు పొందాలని సూచించారు.

పీవీ స్కూల్ అనుమతి రద్దు

విజయపురం మండలం పన్నూరు సబ్ స్టేషన్ గ్రామంలోని పీవీ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ, హైస్కూల్ గుర్తింపు రద్దు చేసినట్లు డీఈవో వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.92మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా ఇటీవల 62మంది ఆస్పత్రి పాలయ్యారన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో ఆయన ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన విద్యాశాఖ అధికారులు పాఠశాల గుర్తింపు రద్దు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం ఇక్కడ చదువుతున్న విద్యార్థులు సమీపంలోని పాఠశాలల్లో చదువుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన

- యువకుడికి దేహశుద్ధి



చెట్టుకు కట్టివేయబడ్డ కుమార్

శాంతిపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని పట్టుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసిన సంఘటన శాంతిపురం మండలంలో జరిగింది. మఠం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని ఎస్ఎల్వీ కళ్యాణ మండపం వద్ద కాపురం ఉంటున్న రమేష్ మంగళవారం కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటి ప్రహరీపై బడుగుమాకులపల్లెకు చెందిన కుమార్ కూర్చొని ఎంతసేపటికీ వెళ్లకపోవడంతో ఇంట్లో ఉన్న మహిళలు అక్కడినుంచి వెళ్లాలని సూచించడంతో వారితో అసభ్యకరంగా ప్రవర్తించాడు.అడిగిన చుట్టుపక్కల వారిపై దాడికి దిగి పరుగు తీశాడు. వెంబడించి పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని కుమార్ తల్లిదండ్రులను పిలిపించి మందలించారు. మద్యం మత్తులో అలా ప్రవర్తించాడని.. ఇకపై అలా జరగకుండా చూసుకుంటామని వారు చెప్పడంతో ఆ యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తిరుమలేశుడికి బ్రహ్మాండోత్సవం

నేటినుంచి ప్రారంభంకానున్న వాహనసేవలు
పుష్ప, విద్యుత్ అలంకరణతో ముస్తాబైన కొండ





శ్రీవారి ఆలయం ముందు..



శ్రీవారి ఆలయం లోపల అలంకరణ

తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు తిరుమలేశుడికి జరిగే బ్రహ్మాండోత్సవానికి టీటీడీ అంతా సిద్ధం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ దాదాపు రూ.25 కోట్లతో ఏర్పాట్లను చేపట్టింది. పుష్ప, విద్యుద్దీపాలంకరణలతో తిరుమల కొండ భక్తులకు కనువిందు చేస్తోంది. మంగళవారం అంకురార్పణ ఘట్టంతోనే తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల వరకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇక, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరగనుంది. దీంతో ఆలయ నాలుగు మాడవీధుల్లో వాహనసేవలు మొదలు కానున్నాయి. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు దేవేరులతో కలిసి మలయప్పస్వామి వివిధ వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. 28వ తేదీన గరుడవాహనం మాత్రం సాయంత్రం 6.30 గంటలకే మొదలుకానుంది.

మెరిసిపోతున్న కొండ

ఈఏడాది రూ.5.30 కోట్లతో అలిపిరి గరుడ సర్కిల్ నుంచి శ్రీవారి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. శ్రీవారి ఆలయంతో పాటు జీఎన్సీ టోల్‌గేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, వైకుంఠం క్యూకాంప్లెక్స్, మాడవీధులు, అన్నప్రసాదభవనం, ఆస్థానమండపం, రాంభగీచ, లడ్డూ కౌంటర్ వంటి ప్రధాన ప్రాంతాలతో పాటు రోడ్లకు ఇరువైపులా, పార్కులు, వాటర్‌ఫౌంటెన్లు, ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ, పార్కాన్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

మనసుదోచే పుష్పాలంకరణ

ఏటా 8 నుంచి 10 టన్నుల పుష్పాలతో అలంకరణ చేపట్టేవారు. ఈసారి ఎక్కువమంది దాతలు ముందుకు రావడంతో 6 టన్నులతో శ్రీవారి ఆలయంలోపల, మరో 12 టన్నులతో వెలుపల.. మొత్తం 18 టన్నుల సంప్రదాయ పుష్పాలతో స్వామి క్షేత్రాన్ని ముస్తాబు చేశారు. లక్ష కట్‌ఫ్లవర్స్‌లో ఆలయంలోని ధ్వజస్తంభం ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. గరుడసేవ ముందురోజు, మహారథం ముందురోజు ఈ పుష్పాలంకరణలను మార్చనున్నారు. ఈఏడాది ప్రత్యేకంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్1, జీఎన్సీ టోల్‌గేట్ వద్ద పుష్పాలంకరణలు చేశారు.

కంకణ భట్టాచార్యుడిగా వేణుగోపాల దీక్షితులు

ఏటా బ్రహ్మోత్సవాల్లో అర్చకుల్లో ఒక్కరిని కంకణ భట్టాచార్యులుగా నియమిస్తారు. ఈ క్రమంలోనే పూర్వం బ్రహ్మోత్సవాలతో పాటు వసంతోత్సవాలు వంటి కైంకర్యాలను విజయవంతంగా నిర్వహించి, శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా వ్యవహరిస్తున్న వేణుగోపాల దీక్షితులను ఈఏడాది ఎంపిక చేశారు. అంకురార్పణ నుంచి చక్రస్నానం వరకు ఆయన ప్రధాన పాత్రపోషిస్తారు. ఉదయం, సాయంత్రం మడిని పాటిస్తూ నిత్యహోమాలు, ఇతర వైదిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు పొలిమేర దాటరు.

స్వామిసేవకు 50 మంది అర్చకులు


వాహనసేవలను, యాగశాల్లో కైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించేందుకు 50 మందికిపైగా అర్చకులు సిద్ధమయ్యారు. ఉదయం, రాత్రి జరిగే వాహనసేవలతో పాటు యాగశాల, గర్భాలయం, ఉప ఆలయాలు వంటి వివిధ ప్రాంతాల్లో కైంకర్యాల కోసం అర్చకులకు విధులు కేటాయిస్తూ ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇక, వాహన సేవల్లోని ఉత్సవర్లను అలంకరించేందుకు ఎప్పటిలానే చెన్నై నుంచి మరో ఇద్దరు అలంకరణ భట్టాచార్యులు తిరుమలకు చేరుకున్నారు.

ఏర్పాట్లు భేష్..!

- ఊరేగింపుగా వెళ్లి పరిశీలించిన విష్వక్సేనుడు
- శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీవారి సేనాధిపతి అయిన విష్వక్సేనుడు రాత్రి 7 గంటలకు విశేష అలంకరణలో గదతో తిరుచ్చి వాహనంపై ఆలయం నుంచి వెలుపలకు వచ్చారు. మహాద్వారం వద్ద హారతి అందుకుని నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక, ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగానే పేడతో అలంకరించారు. సేనాధిపతి ఊరేగింపు తర్వాత ఆ ప్రదేశంలో బ్రహ్మపీఠాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మంత ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానించారు. అనంతరం భూమాతను ప్రార్థిస్తూ అందులో ముందుగానే సేకరించిన మట్టిని కుండలలో వేసి శాలి, వ్రిహి, యువ, ముద్గ, మాష, ప్రియంగు వంటి నవధాన్యాలను చల్లి నీరు పోశారు. ఆ పాలికలను నూతన వస్త్రంతో అలంకరించి పుణ్యాహవచనం నిర్వహించారు. ఇలా శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తూ మొలకలు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్ట ఉద్దేశం. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డి, నరేష్, శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని భక్తజనం కొలుస్తారు. దేశం నలుమూలల నుంచీ తండోపతండాలుగా తరలివస్తారు. స్వామి వైభవాన్ని చూసి తరిస్తారు. వెయ్యేళ్లుగా తిరుమల ఆలయంలో కొనసాగుతున్న పూజా కైంకర్యాలు, స్వామికి అలంకరించే ఆభరణాలు, అనుసరిస్తున్న ఆచార సంప్రదాయాలు.. వెనుక ఆయన భక్తాగ్రేసరులు ఎందరో ఉన్నారు. చక్రవర్తుల మొదలు సామాన్యుల దాకా ఆయన సేవలో తరించి అనుగ్రహం అందుకున్నారు.. అందులో కొందరి గురించి బ్రహోత్సవాల సందర్భంగా స్మరించుకుందాం..



సేవింతురే!



చిత్రం: పి.రమేష్, శ్రీకాళహస్తి

శ్రీవారి సర్వసేనాని

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠప్రదక్షిణ ద్వారానికి పక్కన చిన్న మందిరంలో దక్షిణాభిముఖంగా విష్వక్సేనుడి శిలాప్రతిమ ఉంటుంది. ఆణివార ఆస్థానంలోను, ఉగాది, దీపావళి ఆస్థానాల్లోను, బ్రహ్మోత్సవాల్లోను, విశేష తిరువీధి ఉత్సవాల్లోను పంచ ఆయుధాలు ధరించిన పంచలోహ విష్వక్సేనుడు మాడవీధుల్లో ఊరిగి ఏర్పాట్లను పర్యవేక్షిస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రధాన సైన్యాధిపతి ఈయన. విష్వక్సేనుడు అంటే అంతటా వ్యాపించిన సేన కలవాడు అని అర్థం. 'విష్వక్సేనో జనార్దనః' అని అమరం పేర్కొంటుంది. విష్వక్సేనుడు అనే పేరు విష్ణుదేవుని సేనాపతికి ఉంది. విష్ణుదేవుడే తన సైన్యాల కోసం తానే సేనాపతిగా అవతరించి విష్వక్సేనుడు అయ్యాడు అంటారు. కాకపోతే వేరొకరు జగన్నాయకుని సేనలకు ఆధిపత్యం వహించగలరా? మంగళవారం అంకురార్పణ రోజున ఆయన మాడవీధుల పర్యవేక్షణ తర్వాతే బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభం అయ్యింది.



సిద్ధమైన సైకత శిల్పం

అలాగే ఈసారి 'వైకుంఠంలోని విమాన వేంకటేశ్వరస్వామి గోపురాన్ని తిరుమలకు తెస్తున్న గరుడుడు' అనే అంశంపై సాండ్ ఆర్ట్‌ను కూడా సిద్ధం చేశారు.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,681

తలనీలాలు సమర్పించినవారు: 19,510



భగవద్బంధువులు శ్రీవారి సేవకులు

చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు సేవలు అందిస్తున్న శ్రీవారిసేవకులు భగవద్బంధువులు అని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శ్రీవారిసేవకులతో తిరుమలలోని ఆస్థానమండపంలో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 'తిరుమలకు వచ్చే భక్తుల్లోనే భగవంతుడు ఉన్నాడు. వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లే' అన్నారు. దేశంలోని ఎంతోమంది ప్రముఖులు శ్రీవారి సేవ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. శ్రీవారిసేవకులకు ప్రస్తుతం కల్పిస్తున్న సాధారణ దర్శనం స్థానంలో స్వామిని మరింత దగ్గరగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను అధికారులను కోరారు. దీనిపై బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్, సీవీఎస్వో మురళీకృష్ణ, డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, సీపీఆర్వో రవి, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



90 వేల మొక్కలతో పుష్పప్రదర్శన శాల

తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఎప్పటిలానే ఫల పుష్ప ప్రదర్శన శాల సిద్ధమైంది. దాదాపు 90 వేల మొక్కలను ఈసారి ప్రదర్శనలో ఉంచారు. ఇందులో 18 రకాల పుష్పమొక్కలను వివిధ రంగుల్లో ఒకేచోట చూసే అవకాశం భక్తులకు లభించనుంది. ఇక, పండ్లు, కూరగాయలతో పక్షులు, జంతువులను ఏర్పాటు చేశారు. శ్రీరాముడిపైనే యుద్ధానికి సిద్ధపడిన హనుమంతుడు, భీముడు-బకాసురుడి యుద్ధం, శ్రీరాముడు ద్వితీయ వివాహం చేసుకున్నాడనే సీతమ్మ అనుమానాన్ని నివృత్తి చేస్తున్న వాల్మీకి మహర్షి, ఇంద్రుడితో యుద్ధం చేస్తున్న శ్రీకృష్ణార్జునులు, లంకిణి అనే రాక్షసి నోట్లోకి ప్రవేశిస్తున్న ఆంజనేయుడు, లంకాదహనం, విష్ణువుకు పవళింపుసేవ చేస్తున్న ఆంజనేయుడు, ఘటోత్కజుడు, చిన్నకృష్ణుని లీలలు, శ్రీకృష్ణుణి తులాభారం, అహంకార భక్తికంటే ఆత్మశుద్ధితో పూజించేవారికే తాను విధేయుడని నిరూపిస్తున్న స్వామి.. ఇలా పురాణాల్లోని దాదాపు 14 ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపే సెట్టింగులు వేశారు. ఈప్రదర్శనశాల గురువారం నుంచి భక్తులకు అందుబాటులోకి రానుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







అంగరంగ వైభవంగా జరిగే శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతలనూ ఆహ్వానిస్తూ ఆలయంలో ఎగరేసేదే ధ్వజపటం. ఆహ్వానం పలికేవాడు గరుడుడు. కొడితాడు సాయంతో ధ్వజస్తంభం శిఖరానికి చేర్చి ఎగరేసే కార్యక్రమమే ధ్వజారోహణం. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులూ రెపరెపలాడే ధ్వజపటం నుంచి గరుడుడు వేడుకలను వీక్షిస్తుంటాడు. పసుపువర్ణంతో ఎగిరే ఈ పతాకం మీద రెక్కలు విప్పుకుంటూ ఒక కాలు నేలకు ఆన్చి మరో కాలు గాల్లోకి లేస్తున్నట్టుగా గరుడుడి చిత్రం ఉంటుంది. తొమ్మిది అడుగుల ధ్వజపటాన్ని 40 ఏళ్లుగా రూపొందించే అరుదైన అవకాశం తిరుపతి చిత్రకారుడికి దక్కింది. ఆయనపేరు శ్రీవశ్రీ. పూర్తి పేరు పేరూరు శివప్రసాద్. టీటీడీ చిత్రకారుడిగా సుప్రసిద్ధుడు. 40వ ధ్వజపటచిత్రాన్ని సోమవారం నాడు తిరుమల ఆలయంలో స్వామి పాదాల ముందుంచి అధికారులకు అప్పగించిన శివశ్రీ ఆంధ్రజ్యోతితో పంచుకున్న విశేషాలు...


- ఆంధ్రజ్యోతి - తిరుపతి

శ్రీవారికి

శివశ్రీ చిత్రకైంకర్యం

40 ఏళ్లుగా ధ్వజపటం సమర్పిస్తున్న చిత్రకారుడు

> ధ్వజపటం వేయడం అన్నది చిత్రకళకు మాత్రమే పరిమితమైనది కాదు. అదొక దివ్యానుభూతి. స్వామితో ఏర్పడిన ఆత్మిక బంధం. ఈ పనికి ఆయన నన్ను ఎంచుకున్నాడు. నా ప్రయత్నం మాత్రమే అయితే 40 ఏళ్లు నిర్విఘ్నంగా సాగేదేనా?!



నిష్ఠతో మూడు రోజులు

గరుడపటం కోసం మూడుకి 9 అడుగుల నిడివి ఉండే తెల్లని మెత్తని వస్త్రంను ఎంచుకుంటాం. పసుపులో ఒక రోజంతా ఆ గుడ్డను నానబెట్టాలి. ఆ తర్వాత నిమ్మ ఉప్పులో ఒక గంట ఉంచాలి. ఆరిన తర్వాత చిత్రరచన మొదలవుతుంది. నా శ్రీమతి పసుపు అద్దకం పూర్తయ్యాక ఒక గదిలో మూడు రోజులు నిష్ఠతో నేను మాత్రమే చేసే కార్యం ఇది. బొగ్గు, ఎర్రమట్టి, నామం కొమ్ము, తిరుచూర్ణం ఇందుకు వినియోగిస్తాం. క్రీడాఉద్యానవనాన్ని భూమి మీదకు దించినవాడు గరుడుడు. భూమితో ఆయనకున్న అనుబంధానికి సంకేతంగానే ఎర్రమట్టిని చిత్రరచనలో వాడుతారు. నామంతెలుపు రంగునూ, తిరుచూర్ణం ఎరుపునూ ఇస్తాయి.

1986 నుంచి మొదలు

1979లో టీటీడీలో నేను చేరాను. రిటైరైన తర్వాత కూడా గరుడపటం గీసే అదృష్టం నాకు ఆ స్వామి ఇచ్చాడు. 1986 నుంచీ నేను గరుడచిత్రం గీస్తున్నాను. అంతకు మునుపు టీటీడీకి సంబంధంలేని బయటి చిత్రకారులు దీనిని రూపొందించేవారు. భక్తి శ్రద్ధలతో, నియమనిష్ఠలతో చేయాల్సిన పని ఇది. టీటీడీలో అటువంటి చిత్రకారులు లేరా అని అప్పటి ఆలయ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణపై ముందస్తుగా నిర్వహించిన సమావేశంలో అన్నారట. ఉన్నారని భరోసా ఇచ్చినవారు డాలర్ శేషాద్రి. నాకు మంచి మిత్రుడు. నిజానికి ఈ అవకాశం మొదట హెన్రీ గారికి వచ్చింది. ఆయనే నాపేరును సూచించారు. తొలిసారి చిత్రం ప్రారంభించే ముందు జియ్యం గార్లు, ఆలయ అర్చకులు నన్ను కూర్చోబెట్టుకుని గరుడ పటం విశిష్టత గురించి, గరుడుడి ప్రాధాన్యం గురించి చాలా వివరించారు. భక్తితో చేయాల్సిన పని అంటూ అప్పగించారు. అలా మొదలైన గరుడచిత్రకైంకర్యం 40 ఏళ్లుగా కొనసాగుతోంది. స్వామి తనకు సేవచేసేందుకు కొందరిని ఎంచుకుంటాడు. అలాంటివారిలో బహుశా నేనూ ఒకడిని. లేకపోతే రిటైరైన తర్వాత కూడా ఈ అపురూప అదృష్టం నాకు దక్కేదా?



సర్పాలే ఆభరణాలు

చిత్రంలోని గరుడుడికి అలంకారాలుగా అమరేది అష్టమహాసర్పాలు. శిరస్సున కిరీటంలా మారిన శంకువును అల్లుకుని సర్పాలుంటాయి. చెవి రింగులుగా పద్మ, మహాపద్మాలు, కంఠాభరణంగా కర్కోటకుడు, యజ్ఞోపవీతంగా వాసుకి, నడుమును చుట్టుకుని తక్షకుడు, కుడి, ఎడమ చేతులకు కంకణాలుగా గుళికుడు, అనంతుడు ఆభరణాలుగా ఉంటారు.



గూడూరును జిల్లాగా ప్రకటించాలి



గూడూరు నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. స్థానికులు, అధికారులు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు నెల్లూరు జిల్లాలో కలపాలి. లేదా గూడూరు కేంద్రంగా జిల్లాగా ప్రకటించాలి.

- పాశం సునీల్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే

ట్రామాకేర్ సెంటర్ కావాలి



సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుదీర్ఘమైన జాతీయ రహదారి ఉంది. ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్యం కోసం నెల్లూరు, తిరుపతి, చెన్నై వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా ఉంది. అందుకని నాయుడుపేట లేదా సూళ్లూరుపేటలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీ, యూహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి. ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

- నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలేవీ?



ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే గ్రీన్ అంబాసీడర్లకు ఆరు నెలలుగా జీతాలు అందలేదు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ముక్కంటి ఆలయానికి అనుసంధానం చేస్తే రోగులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలవుతుంది. పశువుల షెడ్లు, ఉపాధి హామీ పథకం కూలి జమ కాకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘానికి వంద మంది సిబ్బందిని నియమించాలి.

- బొజ్జల సుధీర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయండి



ఏడు మండలాలు, శ్రీసిటీ ఉన్న రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి. పిడుగుపాటు, విద్యుత్ షాక్ తదితర ప్రమాదాలకు గురై హఠాన్మరణం చెందుతున్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి.

- ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

ఎంపీపీ కుర్చీకోసం కీచులాట!

● వరదయ్యపాళెం వైసీపీలో వర్గపోరు.. క్యాంపునకు ఎంపీటీసీలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఎంపీపీ కుర్చీ కోసం వైసీపీలో కుమ్ములాట మొదలైంది. ఆ పార్టీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, ప్రస్తుత ఎంపీపీ పద్మప్రియ భర్త దామోదరం రెడ్డి మధ్య వర్గపోరు నెలకొంది. ఈ క్రమంలో ఎంపీపీని దింపేందుకు దాదాపు 9 మంది ఎంపీటీసీ సభ్యులను దయాకర్ రెడ్డి క్యాంపునకు తరలించినట్లు సమాచారం. అదే సమయంలో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు వారిని సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇదంతా ఎందుకంటే.. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ అభ్యర్థులుగా దయాకర్‌రెడ్డి తన భార్య హేమలతను, దామోదర్‌రెడ్డి కూడా తన భార్య పద్మప్రియను వేరువేరు సెగ్మెంట్లలో బరిలోకి దించగా ఇద్దరూ విజయం సాధించారు. ఎంపీపీ పదవిపై అప్పట్లో తీవ్ర పోటీ నెలకొనగా అప్పటి వైసీపీ పెద్దల ఆశీస్సులతో దామోదర్‌రెడ్డి మెజారిటీ ఎంపీటీసీ సభ్యులను పాండిచ్చేరి తరలించి.. పద్మప్రియను ఎంపీపీగా చేసుకున్నారు. అలకపాన్పు ఎక్కిన దయాకర్‌రెడ్డిని అప్పట్లో వైసీపీ పెద్దలు ఎంపీపీ పదవిని రెండున్నర సంవత్సరాలు చెరో సగం పంచుకోవాలని సూచించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీనికి సమ్మతించని దయాకర్‌రెడ్డి ఎంపీపీ రేస్‌నుంచి తప్పుకొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడాయన అసమ్మతి ఎంపీటీసీ సభ్యులను తనవైపు తిప్పుకుని ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి తెరలేపారు. బుధవారం కలెక్టర్‌ను కలిసి ఎంపీటీసీ సభ్యులతో అవిశ్వాస తీర్మానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వైరల్ కాగా, దీనిపై ఇద్దరూ మౌనం వహిస్తుండడం గమనార్హం.

రబీ సీజన్‌కు సమృద్ధిగా ఎరువులు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్‌కు 3.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. దీనికి సంబంధించి ఎరువులుగా సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఎరువులపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఏపీ మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాల వద్ద 2,128 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 2,050 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వచ్చే నెల మొదటి వారానికల్లా మరింత యూరియా తెప్పించేలా చర్యలు చేపడతామన్నారు. అవసరమైన మేరకే ఎరువులు వాడాలని, ఎక్కువగా వాడటం పర్యావరణానికి కూడా మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏపీమార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ టి. పద్మజ మంగళవారం తెలిపారు. ఐబీపీ క్లర్క్, ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్ఆర్‌బీ ఆఫీసర్ స్కేల్-2, 3, ఆఫీస్ అసిస్టెంట్, ఎస్ఎస్‌సీ సీజీఎల్ టియర్-2 వంటి పోటీ పరీక్షల టైర్-2, మెయిన్ పరీక్షలకు తిరుపతి స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతి సౌకర్యాలతో 60 రోజులపాటు శిక్షణ ఉంటుంది. అభ్యర్థులు **apstdc.apcfss.in** వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ కలిగి ఉండాలి. సంబంధిత పరీక్షల టైర్-1 లేదా ప్రిలిమినరీ పరీక్ష రాసుండాలి. వివరాలకు తిరుపతిలోని బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కార్యాలయం లేదా ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్‌ను 86396 27455, 81422 24539 లలో సంప్రదించాలి.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం) సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం రాష్ట్ర స్థాయి కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. రెడ్ శ్యాండిల్ టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన అండి 2017లో చామల రేంజ్, నాగపట్ల సెక్షన్, బొబ్బాలబావి పరిధిలో ఎర్రచందనం చెట్లు నరకడానికి అడవిలోకి వెళుతున్నాడు. అప్పట్లో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేసి అతడిని పట్టుకున్నారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టు ఎదుట హాజరుపరచగా అతడికి రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ కేసును తిరుపతిలోని రాష్ట్రస్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేసి కేసు విచారించారు. దీనిపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలుతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నేడు పశుసంవర్ధకశాఖ జేడీ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఉమామహేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. తిరుపతి జిల్లాలో డీడీగా పనిచేస్తున్న ఈమెకు రాష్ట్ర ప్రభుత్వం జేడీగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లాకు బదిలీ చేసింది. ఈ మేరకు బుధవారం ఆమె జేడీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

గృహనిర్మాణాల వేగవంతంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లదే కీలకపాత్ర

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణాల వేగవంతంలో హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లే కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలు, బంగారుపాళ్యం మండల స్థాయి హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ దశల్లో వున్న గృహాలను, లేఅవుట్లను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రోజూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతి సాధించాలన్నారు. కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్మాణాలు పూర్తిచేసిన హౌసింగ్ లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించకపోవడంపై కొందరు గృహనిర్మాణ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, ఈఈ శంకరప్ప, ఏఈలు, ఇంజనీరింగ్ అధికారులు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో తమిళనాడు వాసి హత్య

పూతలపట్టు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన వంట మాస్టరు పూతలపట్టులో హత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి వివరాలు.. బంగారుపాళ్యం మండలం కురప్పల్లికి చెందిన విజయ్ తేనేపల్లి టోల్‌గేట్ వద్ద డాబా నిర్వహిస్తున్నాడు. తన డాబాలో వంట మనిషిగా పనిచేసేందుకు గాను తమిళనాడు రాష్ట్రం పొన్నై గ్రామానికి చెందిన రూబెన్(32)కు విజయ్ రూ.10వేలు అడ్వాన్స్ ఇచ్చాడు. కానీ పనికి రాకపోవడంతో విజయ్ సోమవారం రాత్రి రూబెన్ వద్దకు తన స్నేహితుడితో కలిసి వెళ్లి ఘర్షణ పడ్డాడు. మంగళవారం ఉదయం తేనేపల్లి సమీపాన గల జగనన్న కాలనీలో ఓ గదిలో రూబెన్ అపస్మారక స్థితిలో పడివుండగా, స్థానికులు గుర్తించి 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ మేరకు పూతలపట్టు పోలీసులు హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ప్రభావంతో గడిచిన 24 గంటల్లో 17 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా గుడిపాలలో 51 మిమీ, అత్యల్పంగా నగరిలో 3.8 మిమీ వర్షపాతం నమోదయ్యింది.మండలాలవారీగా పాలసముద్రంలో 43.2, యాదమరిలో 38.4, శ్రీరంగరాజపురంలో 28.8, బంగారుపాళ్యంలో 28, కార్వేటినగరంలో 27.6, పెనుమూరులో 25.4, చిత్తూరు రూరల్‌లో 17.8, వెదురుకుప్పంలో 17.4, గంగవరంలో 15.4, చిత్తూరు అర్బన్‌లో 13, పలమనేరులో 12.6, గంగాధరనెల్లూరులో 12, బైరెడ్డిపల్లిలో 7.8, నిండ్రలో 6.2, తవణంపల్లెలో 5.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న పీవీకేఎన్ విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో కళాశాలలోని ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, యూత్ రిక్రియేషన్ క్లబ్ విభాగం విద్యార్థులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు సేవా సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌సీ కార్యదర్శి సహదేవనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి రైతు ఖాతాల్లో నగదు జమచేయకుంటే ఉద్యమం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మామిడి రైతు ఖాతాల్లో రూ.480 కోట్లు జమచేయకుంటే అక్టోబర్‌లో ఉద్యమం తప్పదని మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మామిడి రైతుల సంక్షేమ సంఘ సమావేశం అధ్యక్షుడు జనార్ధన్ అధ్యక్షతన జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 35 వేల మంది రైతులు నాలుగు లక్షల టన్నులు మామిడి సరఫరా చేశారని, వీరి ఖాతాల్లో కిలోకు రూ.12 చొప్పున నగదు జమచేయకుంటే అక్టోబరులో ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రైతులు మునీశ్వర్‌రెడ్డి, మునిరత్నం, హేమలత, భారతి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో విజయనగరం ఎంపీ



అన్నదాన కేంద్రంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న పార్లమెంట్ సభ్యుడు - స్వామి సేవలో పాల్గొన్న సినీ హీరో

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వారిని ఈవో పెంచల కిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా ఆలయ అన్నదాన కేంద్రంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే స్వామిని సినీ హీరో ఉదయ్‌శంకర్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

గాంధీ రోడ్డు విస్తరణ పనుల పర్యవేక్షణ


విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీ రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షించారు. గాంధీరోడ్డులో కోర్టు డౌన్ నుంచి లిల్లీబ్రిడ్జి వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. విస్తరణ పనులకు అడ్డంకింగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, విద్యుత్‌లైన్ల స్థానచలనం వంటి అంశాలపై విద్యుత్‌శాఖ అధికారులతో చర్చించారు. అదేవిధంగా నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో అవసరమైన చోట్ల వీధి దీపాలను ఏర్పాటుచేయాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సంతపేట నుంచి కాణిపాకం బైపాస్ వరకు వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చెన్నపట్నం చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● కలెక్టర్ సుమిత్ కుమార్




పాయలగుట్టకు ద్విచక్రవాహనంలో పోతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ - గువ్వలగుట్ట ఎస్టీకాలనీ వాసుల సమస్యలపై ఆరా తీస్తున్న కలెక్టర్ - పూరిపాకల్లో నివాసం ఉన్న దంపతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సోమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్నం చెరువు అభివృద్ధి పనులను ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మంగళ వారం సోమల మండలంలోని చెన్నపట్నం చెరువు, గండిపడిన కల్వర్టును కలెక్టర్ సందర్శించారు. కల్వర్టు పనులు చేపట్టేందుకు రూ.85 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఈఈని ఆదేశించారు. అనంతరం 3 కిలోమీటర్లు నడచి గువ్వగుట్ట ఎస్టీకాలనీకి చేరుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డులు లేని వారికి వెంటనే తీయించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి పాయలగుట్ట ఎస్టీ కాలనీకి చేరుకుని శిథిలావస్థలోని గిరిజనుల గృహాలను పరిశీలించారు. 14 ఇళ్లకు రూ.1.50 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. పనుల కోసం వలసలు వెళ్లకుండా స్థానికంగా పనులు చేసుకోవాలని సూచించారు. తమ భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజనులు కోరారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇరిగేషన్ డీఈఈ రాజేంద్రప్రసాద్, డీపీవో సుధాకర్, తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సాగునీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, నీటి సంఘ మాజీ అధ్యక్షుడు కోటీశ్వరరావు, చంద్రశేఖర్ నాయుడు, సతీశ్, సర్పంచ్ రెడ్డెప్ప, మోహన్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి మేనక, పీఆర్ జేఈ ఆనంద్, హౌసింగ్ అధికారి మణికంఠ పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజదాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన కొబ్బరిచెట్లు


రాతికూసాలను విరిచేసిన ఏనుగులు

కల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడం లేదు. రోజూ మండలంలోని ఏదో ఒక ప్రాంతంలో ఏనుగుల గుంపు పంటలపై విధ్వంసం సృష్టిస్తుండటంతో పంటలకు అపారనష్టం కలుగుతోంది. ముందుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 12 ఏనుగుల గుంపు కల్లూరు-గంటావారిపల్లి రోడ్డును దాటుకొని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల మీదుగా పాతపేట సమీపంలోకి చేరుకున్నాయి. కల్లూరులోని రఫీ, నవాబ్‌సాహెబ్, రామకృష్ణయ్యకు చెందిన మామిడిచెట్లు, రాతికూసాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కల్లూరు-సదుం రోడ్డును దాటుకొని పూరేడువాండ్లపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని గుర్రప్ప, వెంకటస్వామి, ప్రభాకర్, వెంకటేష్, కల్లూరులోని షబ్బీర్‌కు చెందిన వరి, అరటి, కొబ్బరి పంటలను ఏనుగులు నాశనం చేశాయి. అక్కడి నుంచి ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకొని ప్రసాద్, బాలకృష్ణ, నడిపన్నకు చెందిన వరిపంటను ధ్వంసం చేశాయి. గౌరిశెట్టివారిపల్లిలోని రైతులు ఉషారాణి, నరసింహులుకు చెందిన వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే అడవిలోని పెద్దవంక వద్దకు చేరుకున్నాయి. మంగళవారం పగలంతా పశ్చిమ విభాగం అడవిలోని పెద్దవంక సమీపంలోనే ఏనుగులు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు.

1529మందికి చేరిన డీఎస్సీ విజేతలు


డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల సంఖ్య పెరిగినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జోనల్ పరిధిలోని మోడల్ స్కూల్లో (పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్, ట్రైండ్ గ్రాడ్యుయేట్ టీచర్స్) 121మంది టీచర్లు డీఎస్సీ ద్వారా ఎంపికైనట్లు తెలిపారు. వీరు కాక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టులకు గాను 1408 మంది ఎంపికైన విషయం తెలిసిందే. ఇదే జాబితాలో జోనల్ పరిధిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 121 మంది టీచర్ పోస్టులకు ఎంపిక కావడంతో మొత్తంగా 1529 మంది టీచర్లు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. వీరందరికీ గురువారం అమరావతిలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులతో పాటు వారి సహాయకులను బుధవారం విజయవాడ తీసుకెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు విద్యాశాఖ సిబ్బంది, సహాయకులు కలుపుకుని ప్రయాణం చేసేందుకు వీలుగా 84 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బస్సులో ఎంఈవో/హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీడీ/పీఈటీలను పర్యవేక్షకులుగా నియమించినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 7 గంటలకు తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. వీరికి అవసరమైన సమాచారం అందించేందుకు వీలుగా హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలుగా ఎంపికైన అభ్యర్థులకు విడివిడిగా వాటప్స్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పుడు ఎక్కడికి ఎలా చేరుకోవాలి, విజయవాడలో ఏర్పాటు చేసిన గ్యాలరీలో ఎక్కడ, ఎవరు ఉండాలనే సమాచారం క్షుణ్ణంగా తెలియజేస్తున్నట్లు తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా విభజించి, ప్రయాణ సమయంలో గూడూరు, ఒంగోలు ప్రాంతాల్లో భోజన ఏర్పాట్లు చేశామన్నారు.చిత్తూరు, తిరుపతి, మదనపల్లె, పుత్తూరు డీవైఈవోలు వీటన్నింటినీ పర్యవేక్షిస్తారన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచండి


ప్రకృతి వ్యవసాయ మహిళారైతును సన్మానిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై గ్రామీణ ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకుగాను అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడిరైతులను అభివృద్ధి చేసేందుకు, పశుగ్రాసం పెంచేందుకు సహజ, సేంద్రియ వ్యవసాయ విధానాల గురించి గ్రామ, మండలస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై త్వరలో మూడ్రోజుల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసదస్సులో ఇదివరకు ప్రకృతి వ్యవసాయం చేసి లబ్ధిపొందిన రైతుల విజయగాథలను వివరించాలని చెప్పారు. రెండువారాల్లోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ జిల్లాలో 34,633 ఎకరాల్లో 35,211 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. జిల్లాలో 260 క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించిన రైతులు సుజాత, సుమతి, కవిత, సోమల వెంకటసుబ్బరాజు, ఎస్.నరేంద్ర, చందుకుమార్, నాగరాజు, చెంగల్‌రెడ్డి, మహేష్‌లను కలెక్టర్ శాలువ కప్పి ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రకృతి వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ, ఉద్యాన, డీఆర్డీఏ, పశుసంవర్ధక, పట్టు, డ్వామా, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ అవసరాలకు వ్యవసాయాన్ని వాడుకుంటారా?

విపక్షంపై ఎమ్మెల్యే మురళి ఫైర్



ఐరాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజకీయ అవసరాల కోసం విపక్షం వ్యవసాయాన్ని వాడుకుంటోందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మండిపడ్డారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తోతాపురి మామిడి పంటకు ధర లేకపోవడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున కేజీకి రూ.4 అదనంగా చెల్లిస్తామని ప్రకటించారన్నారు. గుజ్జు ఫ్యాక్టరీల నుంచి రైతులకు మద్దతు ధర అందేలా చూసేందుకు వ్యవసాయ శాఖ మంత్రి పర్యవేక్షించారన్నారు.విత్తన వేరుశనగ కాయలు తక్కువున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లితే గంటల వ్యవధిలో స్పందించిన తీరు లబ్ధి పొందిన రైతులను అడిగితే తెలుస్తుందన్నారు.దురదృష్టవశాత్తు విపక్షం మాత్రం ఏ సీజన్ మొదలైతే ఆ పంటలు పండే ప్రాంతానికి వచ్చి అనవసరంగా రాద్ధాంతం చేస్తోందన్నా రు.ఇలాంటి వారి పట్ల రైతాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు.గతంలో భూ సర్వే పేరుతో జగనన్న రాళ్లు ఎక్కడ నాటి ఎలా భూములను ఆక్రమించాలా అని చూసిన వ్యక్తులు తమ ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యవసాయ విధానాలను విమర్శించడం సిగ్గుచేటన్నారు.

వీఐపీలకు విస్తృత బందోబస్తు



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి, సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. తిరుపతిలో అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 150 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు బందోబస్తులో పాల్గొంటారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమల మార్గంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. వీఐపీల భద్రతకు ఇద్దరు అదనపు ఎస్పీలు, రిజర్వు బలగాలు, ఐదుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, పోలీసులను వినియోగిస్తున్నారు. వీరితో పాటు ఏపీఎస్పీ, రిజర్వు, ఆక్టోపస్, విజిలెన్సు సిబ్బంది బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. వీఐపీలు వెళ్ళే సమయంలో 45 నిమిషాల ముందు ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో కాన్వాయ్ మార్గాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

నేడు ఉపరాష్ట్రపతి రాక

తిరుపతి(కలెక్టరేట్)/తిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం సాయంత్రం 7.30 గంటలకు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం ఉదయం మరోసారి శ్రీవారిని దర్శించుకున్నాక కొండపై పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. 11.30 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయల్దేరి వెళతారు.

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం


రేపు సీఎం ప్రారంభించనున్న ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్

తిరుమల/తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దీనికోసం ఆయన బుధవారం సాయంత్రం హెలికాప్టర్‌లో తిరుపతిలోని తాజ్ హోటల్ వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గాన తిరుమలలోని గాయత్రి నిలయానికి వస్తారు. రాత్రి 7.40గంటలకు బేడీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకుంటారు. ఆయనకు అర్చకులు పరివట్టం చుట్టగా తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. రంగనాయకుల మండపంలో టీటీడీ 2026 డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. వాహన మండపం వద్ద పెద్దశేషవాహన సేవలో పాల్గొంటారు. గురువారం ఉదయం 9.10 గంటలకు భక్తుల వసతిగృహం వెంకటాద్రి నిలయాన్ని ప్రారంభిస్తారు. ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను(ఐసీసీసీ)- ఇంటెలిజెంట్ క్రౌడ్ అండ్ సైబర్‌కంట్రోల్, ప్రసాదాలకు సంబంధించిన ప్లాంట్‌ను ప్రారంభించి తిరుగు ప్రయాణమవుతారు. అలాగే, మంత్రి నారా లోకేశ్ కూడా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి హెలికాప్టర్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన తిరుమలలోని గాయత్రి గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. రాత్రి 7.30 నుంచీ 9 గంటల నడుమ శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం ఉదయం 10.15 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

భూగర్భజలాల పెంపునకే
మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం
డ్వామా పీడీ రవికుమార్


మ్యాజిక్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రవికుమార్

కల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరుస్తూ భూగర్భ జలాల పెంపు కోసమే మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం పనులు చేపడుతున్నామని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. పులిచెర్ల మండలం రాజులపల్లి పంచాయతీ పెద్ద ఎస్సీ కాలనీలో జరుగుతున్న మ్యాజిక్ డ్రైన్ల పనులను మంగళవారం డ్వామా పీడీ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సంప్రదాయ సీసీ డ్రైన్లతో పోలిస్తే తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టవచ్చన్నారు. వర్షపు నీరు రోడ్లపై నిలిచి పోకుండా మ్యాజిక్ డ్రైన్లలో ఇంకిపోతాయన్నారు. ప్రభుత్వం వినూత్నంగా మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేపడుతోందని, భూగర్భ జలాలు పెరిగి నీటి లభ్యత పెరుగుతుందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా ఉపాధి సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఏపీవో సౌభాగ్యవతి, జేఈ కృష్ణయ్య, టీఏలు సుభాషిణి, జ్యోతీశ్వర్‌రెడ్డి, మహేంద్ర, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి


నవీన్‌కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదకుటుంబాలకు సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రి నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనందరెడ్డి తెలిపారు. రామకుప్పం మండలం ఆవులకుప్పానికి చెందిన నవీన్‌కుమార్‌కు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స జరిగింది. ఇందుకు కుటుంబం లక్షల్లో అప్పులు చేసింది. బాధితుడు ఆర్థికసాయం కోసం టీడీపీ కుప్పం కార్యాలయంలో జననాయకుడు విభాగంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా అతనికి రూ.3.06 లక్షలు ఆర్థికసాయం మంజూరు చేసింది. మంగళవారం రామకుప్పంలో అతనికి టీడీపీ నేతలు సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీవైస్‌చైర్మన్ సీతాపతి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, నేతలు గుర్రప్ప, జయశంకర్, సత్తి, రామకృష్ణప్ప, జేయి, మునీంద్రనాయక్, విజయ్‌కుమార్, సతీష్, రామలింగారెడ్డి, శంకర్‌చలం, గిరిదాసు, మురళీ, బాలాజీ, నాగరాజనాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణం


ప్రస్తుతం కొత్తగా నిర్మించిన కల్వర్టు

రామకుప్పం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లె, పల్లెకుప్పం గ్రామాలతోపాటు రెండు గ్రామాల శివార్లలో పొలాల వద్ద ఇళ్లు నిర్మించుకున్న వారి కల నెరవేరింది. ఎస్.గొల్లపల్లె పెద్దచెరువు కుడి వైపున మొరవ మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడ కల్వర్టు లేకపోవడంతో వారు దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు నిండితే అక్కడ చిత్తడి చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉండేది. ఏఎంసీ మాజీ చైర్మన్ గంట్లప్పగౌడు, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ పరిస్థితిని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు మండల నేతల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ కల్వర్టు నిర్మాణానికి రూ.16 లక్షలు నిధులు మంజూరు చేయించారు. నెలరోజుల క్రితం పనులు ప్రారంభమై శరవేగంగా సాగి కల్వర్టు నిర్మాణం పూర్తయింది. దీంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో వ్యవసాయశాఖ కార్యాలయం


పగుళ్లుబారిన వ్యవసాయశాఖ కార్యాలయ భవనం

పలమనేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయశాఖ కార్యాలయం, ఏడీ కార్యాలయాలు శిథిల భవనాల్లోనే నడుస్తున్నాయి. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకొని గోడలు పగుళ్లుబారాయి. పైకప్పు అక్కడక్కడా ఉరుస్తోంది. కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం 2019 అప్పటి పరిశ్రమలశాఖ మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి రూ.50 లక్షలతో నూతన వ్యవసాయ శాఖ భవన నిర్మాణానికి శంఖు స్థాపనచేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణం గురించి పట్టించుకోలేదు. మండలంలోని పంచాయతీల్లో 9 చోట్ల రైతు భరోసా కేంద్రాలను కొత్తగా నిర్మించినప్పటికి నియోజకవర్గ కేంద్రంలో దుస్థితిలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో ఈ కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయ శాఖ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాల్సి ఉంది.

లక్ష్మీనారాయణ సేవలు ఎనలేనివి


గంగిశెట్టి లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

గుడుపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ సేవలు ఎనలేనివని మాజీ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ద్రావిడ వర్సిటీ ఎమినో భవనం సమావేశ హాల్‌లో గంగిశెట్టి లక్ష్మీనారాయణ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగిశెట్టి లక్ష్మీనారాయణ మూడేళ్ల పాలనలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి యూజీసీ గుర్తింపును వర్సిటీకి తీసుకొచ్చారన్నారు. ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ఆచార్య తిరుపతిరావు మాట్లాడుతూ ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ గొప్ప సాహిత్య వేత్తగా కొనియాడారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు నివాళులర్పించారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి


రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలందరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజ, శీను, నవీన్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీ కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. మహిళలకు టీబీ, షుగర్, బీపీ, క్యాన్సర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం అందరి లక్ష్యం కావాలి


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వాణిశ్రీదేవి

రొంపిచెర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం అందరి లక్ష్యం కావాలని పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీదేవి అన్నారు. మంగళవారం రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ రొంపిచెర్ల క్రాస్‌లోని అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, మహిళలు రక్తహీనతకు గురి కాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శిరీషా, గాయత్రి, సుష్మిత, లక్ష్మీదేవి, నాగరత్న, సరస్వతమ్మ పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు శశికుమార్

రొంపిచెర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వృత్తి విద్యపై శిక్షణ అందించారు. సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రిటైల్ రంగంలో, మార్కెటింగ్, ఎలక్ట్రానిక్ తదితరాలపై విద్యార్థుల ప్రత్యేక శిక్షణ తరగతులు అందిస్తున్నామని శిక్షకులు శశికుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఇప్పించండి


ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన సైదాని

పలమనేరు, సెప్టెంబరు23 : పలమనేరు మున్సిపాలిటీలోని తన ఇంటి స్థలాన్ని తనకు తెలియకుండానే తన కుమార్తె పర్వీన్ అమ్మేసిందని.. తన స్థలమే కాకుండా పలు స్థలాలు అమ్ముతున్నారని.. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ సైదాని అనే వృద్ధురాలు పలమనేరు ఆర్డీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. స్పందించిన ఆర్డీవో భవాని సైదాని ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని... సైదానికి న్యాయం చేయాలని పలమనేరు తహసీల్దారును ఆదేశించారు.

టీడీపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు


మునస్వామిని సత్కరిస్తున్న గౌరివిమాకులపల్లె టీడీపీ శ్రేణులు

రామకుప్పం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టించే ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగు గుర్తింపు లభిస్తుందని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి అన్నారు. మంగళవారం రామకుప్పం సింగిల్‌విండో అధ్యక్షుడు మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో గౌరివిమాకులపల్లె పంచాయతీ టీడీపీ శ్రేణుల ఆయన్ను ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవులు రాని వారుఎ ఎవరూ నిరుత్సాహానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిఒక్కరికీ గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు రామిరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్‌గౌడు, బాబుసాబ్, వెంకటప్ప పాల్గొన్నారు.

8 గంటల పనివిధానాన్నే కొనసాగించాలి

పలమనేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పనిగంటలను పెంచకుండా పాత పని గంటలనే కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పలమనేరులో కార్మికులు డిమాండు చేశారు. ఇప్పటి వరకు కార్మికులు 8 గంటలు పనిచేస్తుండగా ఈ పనిగంటలను పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరిధరగుప్తా, రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పలమనేరులో నిరసన తెలిపారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికులు జయంతి, ధనమ్మ, గంగులప్ప, వెంకటేష్, గిరి పాల్గొన్నారు.

కుప్పంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా కేంద్రం



బాలకృష్ణను కలిసిన ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్

కుప్పం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రజల కోసం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా కేంద్రాన్ని నెలకొల్పేందుకు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే బాలకృష్ణ అంగీకరించినట్లు ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో బాలకృష్ణను కలిసిన ఎమ్మెల్సీ ఈ అంశాన్ని ప్రస్తావించగా కుప్పం కోసం సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలపడంతో బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
● వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన దేవతామూర్తులు


పుంగనూరు మండలం చదళ్లలో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి


పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా



అలంకారంలో సల్లాపురెమ్మ, గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు

పుంగనూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ, పరిసర ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం వివిధ అలంకారాల్లో దేవతామూర్తులు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టీటీడీ ఆధ్వర్యంలో స్థానిక కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ఉదయం అష్టలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. పాతబస్టాండ్ వద్ద వెలసిన విరూపాక్షిమారెమ్మ స్వర్ణకవచ బాలంకృత అలంకరణ, బజారువీధిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి వజ్రకవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కె.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వాసవీ సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **చౌడేపల్లె:** దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో కామాక్షిదేవి అలంకరణలో పార్వతిదేవి భక్తులకు దర్శనం ఇచ్చారు. మంగళవారం స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని కామాక్షిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దిండుకుర్తి సుధాకర్‌బాబు కుటింబికులు ఉభయాదారులుగా వ్యవహరించారు.

● **బైరెడ్డిపల్లె:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బైరెడ్డిపల్లెలో బాట గంగమ్మ ఆలయంలో అమ్మవారికి బాలత్రిపుర సుందరీదేవి అలంకారం చేశారు. అర్చకులు నాగేంద్రప్రసాద్ అమ్మవారికి విశేషాలం కరణచేసి ప్రత్యేకపూజలు జరిపారు.

● **సదుం:** దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జాండ్రపేటలో వెలసి ఉన్న శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి సుగంధ పుష్ప, మంగళ గాజుల ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● **సోమల:** సోమల మండలంలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల సంద ర్భంగా అమ్మవార్లుకు ప్రత్యే అలంకరణ చేసి పూజలు చేపట్టారు. కందూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులచే ప్రసాదాలు అందజేశారు. పత్రపల్లె, కందూరు పాలేటమ్మ, సోమల, బోయకొండ గంగమ్మ ఆలయాల్లో భక్తులు అధికంగా పాల్గొన్నారు.

● **పలమనేరు:** దసరా పండుగ సందర్భంగా పలు ఆలయాల్లోని అమ్మవార్లకు ఆలయ అర్చకులు మంగళవారం గాయత్రీదేవి అలంకరణలు చేపట్టారు. పాతపేట దుర్గాదేవి ఆలయం, బసవేశ్వరస్వామి ఆలయం, గంటావూరు కాలనీలోని గంగమ్మ ఆలయల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.

● **గుడుపల్లె:** మండలంలోని రైల్వే క్రాస్ సమీపంలోని కొలువైన రాళ్ల గంగమాంబ గాయిత్రీ దేవి అలంకణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేసి గాయిత్రీ దేవి అలంకరణతో విశేష పూజలు నిర్వహించారు.

● **రామకుప్పం:** రామకుప్పం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రుల్లో రెండో రోజైన మంగళవారం పూజలు ఘనంగా జరిగాయి. రామకుప్పంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కాశీవిశ్వేశ్వరాలయం, ఆనిగానూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి, కంబాలదేవులపల్లె సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి విశేష అలంకరణలు చేశారు. సాయంత్రం రామకుప్పం, ఆనిగానూరులోని వాసవీ కన్యకాపరమేశ్వని అమ్మవార్లు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కంబాలదేవులపల్లె చౌడేశ్వరమ్మ ఆలయంలో సప్త మాతృకలకు అన్నపూర్ణేశ్వరి కుంకుమ అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు.

● **బైరెడ్డిపల్లె:** మండలంలోని దాసార్లపల్లె గ్రామంలో అర్చకులు మణిస్వామి ఇంట్లో దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మలకొలువు ఆకట్టుకుంటోంది.

● **చౌడేపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి మంగళవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈవో ఏకాంబరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు.

ప్రతి ఎకరాకూ నీరందించడమే ముఖ్యమంత్రి లక్ష్యం


కృష్ణా జలాలకు పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు నీరందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యమని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు నందిగం ఉదయకుమార్‌నాయుడు అన్నారు. మంగళవారం చెంగుబల్ల నుంచి నిమ్మనపల్లె గౌనిచెరువు వరకు బైకు ర్యాలీ చేపట్టారు. నిమ్మనపల్లె గౌనిచెరువు వద్ద టీడీపీ నేతలు సమావేశమయ్యారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలో నిమ్మనపల్లె గౌనిచెరువు, దండికుప్పం చెరువు, సంతూరు చెరువు, నడింపల్లె జేడు చెరువు, గంగోజమ్మ కుంట, కర్లగట్ట వద్ద పెద్దన్న చెరువు, బాపన చెరువులు నిండాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ గోపాల్, రెస్కో డైరెక్టర్లు అనసూయ, బసవరాజు, చలపతి, ఏఎంసీ డైరెక్టర్లు శ్యామల, హరినాథరెడ్డి, చంద్రకళ, కడా సభ్యురాలు సుగునమ్మ, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, లోకేష్, జయారెడ్డి, మునిరెడ్డి, శేఖర్, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

శాంతిపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివరామపురం పంచాయతీ ఒడ్డువంక గ్రామానికి రోడ్డు నిర్మించేందుకు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే సీసీ రోడ్డు పనులు ప్రారంభించి గ్రామానికి రోడ్డు వసతి కల్పిస్తామని ఎంపీడీవో తెలిపారు. పీఆర్ ఏఈ నాగేంద్ర, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శ్మశానం ఆక్రమించారని దళితుల నిరసన


శ్మశానం ఆక్రమించారంటూ నిరసన వ్యక్తం చేసున్న దళితులు

పుంగనూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని 13వ వార్డు తోపుమఠం దళితుల శ్మశానంలో ఆక్రమణలు తొలగించాలని మంగళవారం శ్మశానం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రాము సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సర్వే చేయించి ఆక్రమణలు ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు.

షెడ్డును తొలగించారని ధర్నా



గంగవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దళిత మహిళ ఉంటున్న షెడ్డును అధికారులు తొలగించడం దారుణమని కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ గౌరవాధ్యక్షులు ఓబులరాజు మాట్లాడుతూ బూడిదపల్లెలో సెంటు ప్రభుత్వ భూమిలో దళిత కుటుంబం 60 ఏళ్లుగా జీవిస్తుంటే ఉన్నట్లుండి అధికారులు షెడ్డును తొలగించడం దారుణమన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, బాధిత మహిళ బంధువులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయాలి


పలమనేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం బూడిదపల్లిలో రేకులషెడ్డులో తలదాచుకొంటున్న ఓ దళిత కుటుంబాన్ని నిరాశ్రయులుగా చేయడం దారుణమని మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షులు డీవీ మునిరత్నం అన్నారు. స్థానిక మానవహక్కుల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దళిత మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందంటే అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్, పోలీసు అధికారులే ఇందుకు బాధ్యులని, వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో మానవహక్కుల సంఘ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం


రోగులకు ఆయుర్వేద మందులు అందిస్తున్న వైద్యులు

కుప్పం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదంతోనే అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కాగలరని డాక్టర్ హేమలత అన్నారు. ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న డీపీవో

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని చిత్తూరు డీపీవో సుధాకర్‌రావు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో అప్పాజీ, ఈవోపీ ఆర్డీ నారాయణ పాల్గొన్నారు.



దివ్యాంగులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నగరి, సెప్టెంబరు 23(ఆంధ్ర జ్యోతి): దివ్యాంగులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ మద్దిపట్ల వెంకటరమణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌జీఎస్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దివ్యాంగ పిల్లలకు భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(అలింకో) వైద్యుల సహకారంతో నిర్వహించిన మెడికల్ అసెస్మెంట్ క్యాంప్‌లో పాల్గొన్నారు. ఈ క్యాంపులో 80 మంది పిల్లలు తల్లిదండ్రులతో పాటు హాజరయ్యారు. వారికి ప్రత్యేక వైద్యనిపుణులు వైద్యనిర్ధారణ పరీక్షలు చేశారు. ఏపీసీ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో గత వారం రోజులుగాజరిగిన అసెస్మెంట్ క్యాంపుల్లో 525 మంది దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొని డాక్టర్లచే వైద్య నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారన్నారు. నగరి ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, మధు, హెచ్‌ఎం పార్వతి, సుభాషిణి, చాన్‌బాషా పాల్గొన్నారు.

కాళికాదేవి ఆలయ కుంభాభిషేకం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కట్టమంచిలో సౌమ్య కాళికాదేవి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక పూజలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.



చాముండేశ్వరీ దేవి అలంకారంలో దుర్గాంబ



చిత్తూరులో ప్రత్యేక పసుపు అలంకారంలో చాడేశ్వరమ్మ - లక్ష్మీదేవిగా కాణిపాకంలో మరగదాంబిక - బంగారుపాళ్యంలో బాలాత్రిపురసుందరి దేవిగా ముత్యాలమ్మ - పార్వతిదేవిగా గంగాధరనెల్లూరులో అల్లియెల్లమ్మ - పాలసముద్రంలో మహేశ్వరి బాలగా చెవిటి గంగమ్మ - గాయత్రీదేవిగా నగరి దేశమ్మ తల్లి

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని గిరింపేటలో వెలసిన దుర్గాంబ దేవస్థానంలో జరుగుతున్న దేవీ నవరాత్రి బ్రహోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం చాముండేశ్వరీ దేవి అలంకారంలో దుర్గాంబ భక్తులకు దర్శనమిచ్చారు. పాలకమండలి చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఉభయదారులైన మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి కుటుంబ సభ్యులు, ఈవో తిమ్మారెడ్డి, మాజీ చైర్మన్ వీకే విశ్వనాథ్, కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కట్టమంచి భాస్కరరెడ్డి, అమ్మ హాస్పటల్ అధినేత కల్యాణ్‌బాబు పాల్గొన్నారు. గిరింపేట శివగామి సుందరి అమ్మా సమేత, చిదంబరేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు పసుపు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● ఐరాల(కాణిపాకం): కాణిపాకంలోని మరగదాంబికా సమేత మణికంఠేశ్వర స్వామి అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి మరగదాంబిక ఉత్సవ విగ్రహాన్ని లక్ష్మీదేవి అలంకారంలో కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవోలు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

● బంగారుపాళ్యం: బంగారుపాళ్యం గ్రామదేవత ముత్యాలమ్మ బాలాత్రిపురసుందరి దేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మురళీగురుకుల్ అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయదారులుగా ఊటువంక గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీప్రకాష్, హేమలత, హరి శంకర్, మోహన్, మౌనిక వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఎంబి క్రిష్ణమూర్తి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ● గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరులో అల్లియెల్లమ్మ పార్వతిదేవిగా దర్శనమిచ్చారు. ● పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో వున్న చెవిటిగంగమ్మ ఆలయంలో అమ్మవారు మహేశ్వరి బాల అలంకారంలో దర్శనమిచ్చారు. ● వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం డేరాకండ్రిగలోని నైనేరమ్మ గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ● వెదురుకుప్పం మండలం డీఆర్ఎన్‌కండ్రిగలోని కొండ మల్లీశ్వరస్వామి ఆలయం సముదాయంలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు కటాక్షించారు.

● నగరి: నగరిలో నేత్రాప్రదాయని దేశమ్మ గాయత్రీదేవిగా, బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణేశ్వరి అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఓంశక్తి ఆలయంలో అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. సత్రం దక్షిణ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దాక్షాయణిగా అలంకరించారు. కంకంతేశ్వరాలయంలో దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ● నింద్ర: మండలంలోని కూనమరాజుపాళెంలో మహాలక్ష్మి అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ● విజయపురం: మండలంలోని విజయపురం మిట్టూరులో గాయత్రిదేవిగా కనకదుర్గాదేవి దర్శనమిచ్చారు. ● శ్రీరంగరాజపురం: ఎస్‌ఆర్‌పురం మండలంలోని గంగమ్మగుడిలో శైల పుత్రి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



డేరాకండ్రిగలో గాయత్రీదేవిగా నైనేరమ్మ - ఎస్‌ఆర్‌పురంలో శైలపుత్రిగా గంగమ్మ



ఇళ్లలోకి నీరు... అవస్థల్లో కాలనీ వాసులు

గుడిపాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కిల్లారిపల్లి న్యూకాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రట్టాలమిట్టలో కూడా ఇళ్లల్లోకి వర్షపునీరు వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇంటి స్థలం ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): భాగ పరిష్కారం ద్వారా తనకు సంక్రమించిన ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని జీడీ నెల్లూరు మండలం గెరికలపల్లెకు చెందిన మహాలక్ష్మి చెప్పారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో భూమి వేరే వ్యక్తి పేరిట నమోదు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో తమ భూమి వేరే వ్యక్తి పేరిట నమోదైందని గుడిపాల మండలం రామాపురానికి చెందిన మురగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.



టిప్పర్ ఢీకొని మేస్త్రీ మృతి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం నగర శివారులో జరిగింది. ట్రాఫిక్ ఏఎస్ఐ లోకనాథం వివరాల మేరకు... పూతలపట్టు మండలం వావిల్‌తోటకు చెందిన సుబ్రహ్మణ్యం(52) మేస్త్రీ పనులు చేస్తున్నాడు. ఇంటి నుంచి పని కోసం కాణిపాకంవైపు వెళ్తూ బైపాస్‌రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి మురకంబట్టు వైపు వెళుతున్న టిప్పర్‌ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడగా, చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ సుబ్రహ్మణ్యం మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగునీటి సమస్య పరిష్కారానికి హామీ

యాదమరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిరాళ్ల పంచాయతీ పరిధిలోని పెరుమాళ్లపెంట గ్రామంలో ఉన్న మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు హామీయిచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో మురుగునీరు నిలిచిపోయిందని గ్రామస్తులు ఫిర్యాదుచేయగా, మంగళవారం సీఈవో గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడిన తరువాత ఈ సమస్యను పరిష్కరించడానికి జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. నిలిచిపోయిన నీటిని తొలగించి, పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో వీరేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్యారాణి, డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర పాల్గొన్నారు

సర్వీస్ రిజిస్టర్ ఇవ్వడంలేదు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెన్షన్ పెంపుదల కోసం తన ఉద్యోగ సర్వీస్ రిజిస్టర్ ఇవ్వకుండా పాఠశాల యాజమాన్యం కాలయాపన చేస్తోందని విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి ఆరోపించారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను స్థానిక తపోవనం పాఠశాలలో 1973 నుంచి 1984 వరకు ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందానని చెప్పారు.

భార్య కనిపించలేదని భర్త ఫిర్యాదు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించడంలేదని భర్త బంగారుపాళ్యం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. మండలంలోని కూర్మాయిపల్లెకి చెందిన పాండు భార్య రూపా(35) ఈ నెల 17వ తేదీ రాత్రి నుంచి కనబడకపోవడంతో భర్త బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త పాండు మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు.



రూపా

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): తన భర్త శరత్‌బాబు కనిపించడం లేదని అతడి భార్య పుష్ప మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని యర్రాండ్లపల్లె దళితవాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శరత్‌బాబు(40)ఈ నెల 17వ తేదీ నుంచి కనిపించలేదని భార్య పుష్ప ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు.



శరత్‌బాబు

బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించాలి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్‌పత్రాలతోనే నిర్వహించాలని ఎస్‌డీపీఐ చిత్తూరు అసెంబ్లీ అధ్యక్షులు ఆసిఫ్, కార్యదర్శి తౌఫిక్ సోమవారం ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీని కలిసి వినతిపత్రం అందించారు.